12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :240 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి సోమవారం 7 సెప్టెంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :240 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI MON 7 SEPTEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

# ఓటర్లకు డబ్బు పంచకుండా నా సవాల్ స్వీకరిస్తావా?

## పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్

- తాడిపత్రిలో మరోసారి వేడెక్కిన రాజకీయం
- వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పెద్దారెడ్డికి జేసీ సవాల్
- చెరో రూ. 10 కోట్లు తాడిపత్రి అభివృద్ధికి ఖర్చు చేద్దామని ప్రతిపాదన



**పెన్ పవర్ డెస్క్:**అనంతపురం జిల్లా తాడిపత్రి రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి లక్ష్యంగా టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేస్తూ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని హెచ్చరించిన ఆయన... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తాడిపత్రిలో మట్కా, బెట్టింగ్, గంజాయి దందాలు విచ్చలవిడిగా సాగాయని ఆరోపించారు. బీఎస్-3 వాహనాల కుంభకోణంతో పాటు అక్రమ సంపాదనకు అలవాటు పడి తాడిపత్రి ప్రాంత అభివృద్ధిని కేతిరెడ్డి పూర్తిగా నాశనం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఈ విమర్శలతో పాటు జేసీ ప్రభాకర్ రెడ్డి ఓ ఆసక్తికరమైన సవాల్‌ను కేతిరెడ్డి ముందుంచారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లకు పైసలు పంచే సంస్కృతికి స్వస్తి పలికి, ఇద్దరం చెరో రూ. 10 కోట్ల చొప్పున మొత్తం రూ. 20 కోట్లు తీసి తాడిపత్రి పట్టణాభివృద్ధికి ఖర్చు చేద్దామని ప్రతిపాదించారు. “నా సవాల్‌ను స్వీకరించే ధైర్యం, తాడిపత్రిపై నిజమైన ప్రేమ నీకు ఉందా పెద్దారెడ్డి?” అని సూటిగా ప్రశ్నించారు



## రాజమండ్రిలో కుండపోత.. రోడ్లన్నీ జలమయం

- రాజమండ్రిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం
- ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వాన
- లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం
- డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలు లు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రహదారు లు, లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. ఆదివారం సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం ముంచెత్తింది. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే భారీగా నిలిచిపోయింది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి. ఫలితంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా దానవాయిపేట, ఆవారోడ్డు, ప్రకాశ్ నగర్ సహా పలు ప్రధాన కూడళ్లలో

- మిగతా 2లో

## నేటి నుంచే నూతన పింఛన్ల దరఖాస్తులు

**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సామాజిక భద్రత కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం మరొక కీలక ముందడుగు వేసింది. సంక్షేమ రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ ‘ఎన్టీఆర్ భరోసా’ పింఛను పథకం కింద నూతన దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది.

**రూ. 4,000 పింఛన్.. కొత్త అర్హులకు గొప్ప అవకాశం**

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లను

- మిగతా 2లో



## వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో యువకుల గల్లంతుపై మంత్రుల ఆరా

**పెన్ పవర్ డెస్క్:**మార్కాపురం జిల్లా వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్‌లో ఇద్దరు యువకుల గల్లంతుపై మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. కటకాని పల్లెకు చెందిన ఇద్దరు యువకులు గల్లంతుపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు విస్తృతం చేయాలని ఆదేశించారు. ఫీడర్ కెనాల్‌లో నీరు వేగంగా వస్తుంది కాబట్టి, ఎవరూ కూడా నీళ్లలో దిగవద్దని తెలిపారు. నల్లమల సాగర్‌లో ఎగుడు దిగుడులు ఉండడంతో, ఎక్కడ ఎంత లోతు ఉంటుందో

- మిగతా 2లో





## ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలు..

### విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం

- జకార్తాను కమ్మేసిన బూడిద మేఘాలు
- 300కు పైగా విమాన సర్వీసులు రద్దు
- వేలాది అడుగుల ఎత్తుకు ఎగిసిపడుతున్న బూడిద, ధూళి
- సునామీ ప్రమాదం లేదని స్పష్టం చేసిన ఇండోనేషియా అధికారులు
- బూడిద కారణంగా పలుచోట్ల పాఠశాలలకు సెలవులు, జనజీవనంపై ప్రభావం

- మిగతా 2లో

## హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం
- గతంలోనూ ఇలాంటి దందాలను అరికట్టామని వెల్లడి
- చింతల్‌లో గృహప్రవేశం వద్ద రూ. 50 వేలు డిమాండ్ చేసిన ఘటన వైరల్
- ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంస
- అన్ని కమిషనరేట్ల పరిధిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచన

- మిగతా 2లో



## మధ్యప్రదేశ్‌లో కల్తీ మద్యం కల్లోలం.. 12 మంది మృతి

- మధ్యప్రదేశ్ సాగర్ జిల్లాలో కల్తీ మద్యం కలకలం
- విషపూరిత మద్యం తాగి 12 మంది మృతి.. 10 మందికి పైగా అస్వస్థత
- ఘటనపై సీఎం మోహన్ యాదవ్ సీరియస్.. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం
- నకిలీ మద్యం అమ్మకాలపై ముందే ఫిర్యాదులున్నా పట్టించుకోలేదని ఆరోపణలు
- పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఆరు మద్యం దుకాణాలకు సీల్

**పెన్ పవర్ డెస్క్:**మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో కల్తీ మద్యం పెను విషాదాన్ని నింపింది. అనుమానాస్పద విషపూరిత మద్యం సేవించి 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 10 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా

- మిగతా 2లో



## కాంగ్రెస్ మాట విని తప్పుడు కేసులు పెడితే వదిలే ప్రసక్తే లేదు.. వడ్డీతో సహా చెల్లిస్తాం

### పోలీసులకు పువ్వాడ వార్నింగ్

- బీఆర్ఎస్ పాలనలో పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వహించారన్న పువ్వాడ
- కాంగ్రెస్ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్న అధికారుల జాబితా తమ వద్ద ఉందని వెల్లడి
- బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిక



- మిగతా 2లో

## తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికల్లో ‘మన ప్యానెల్’ హవా.. అధ్యక్షుడిగా సి. కల్యాణ్



- ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికల్లో ‘మన ప్యానెల్’ విజయభేరి
- అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సి. కల్యాణ్
- కోశాధికారిగా చదలవాడ శ్రీనివాసరావు ఘన విజయం
- చిన్న నిర్మాతల సమస్యల పరిష్కారమే లక్ష్యమన్న నూతన కార్యవర్గం
- కోర్టు కేసు కారణంగా నిలిచిపోయిన ప్రధాన కార్యదర్శి పదవి ఎన్నిక

- మిగతా 2లో



## శాస్త్రవేత్తలను బీజేపీ రాజకీయ పావులుగా వాడుకుంటోంది

- శాస్త్రవేత్తలను బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రచారానికి వాడుకుంటోందన్న మాణికం టాగూర్
- విజయాలను ఘనంగా చెప్పుకుంటూ వారి కష్టాలను విస్మరిస్తోందని విమర్శలు
- జీతాలు, ఉద్యోగ భద్రతపై శాస్త్రవేత్తల ఆందోళనలు పట్టించుకోవడం లేదంటూ ఫైర్
- కాంగ్రెస్ నిర్మించిన ఇస్రోను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ఆరోపణ
- సైంటిస్టుల విజయాల్లో కనిపించే మోదీ.. సమస్యలపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీత

- మిగతా 2లో

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి



**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాం తంలో నిర్మాణంలో ఉన్న ఐదం తస్తుల భవనం ఒక్కసారిగా కుప్ప కూలింది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా,

- మిగతా 2లో

# నేటి నుంచే నూతన పింఛన్ల దరఖాస్తులు

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం క్రమం తప్పకుండా అందిస్తోంది. అయితే, వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలకు, నూతనంగా అర్హత సాధించిన వారికి కూడా లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.

**నూతన పింఛన్ల ప్రక్రియ - పూర్తి షెడ్యూల్**

సెప్టెంబర్ 7 - 16: నూతన పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ.

సెప్టెంబర్ 17 - 21: జనరల్ వెరిఫికేషన్ (సాధారణ పరిశీలన).

సెప్టెంబర్ 22 - 24: ఫిజికల్, శాఖాపరమైన ధ్రువీకరణ, అర్హతల నిర్ణయం.

సెప్టెంబర్ 25 - 26: 'సెర్ప్' (SERP) ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.

దరఖాస్తు కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 'స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు' (గ్రామ/వార్డు సచివాలయ) కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు.

**ప్రత్యేక ఏర్పాట్లు**

దరఖాస్తుదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల వద్ద ముందస్తుగా ప్రత్యేక కౌంటర్లు, సదుపాయాలు ఏర్పాటు చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు అవసరమైన పత్రాలతో సమీప సచివాలయానికి వెళ్ళి తమ దరఖాస్తులను అందజేయాలని అధికారులు సూచించారు. అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరితగతిన నూతన పింఛన్లు మంజూరు చేయనున్నారు.

## ఎడిటర్ వ్యూ

## వరుస కట్టేసిన వారసులు.. బాబుకు తలనొప్పేనా?

వారసుల రంగ ప్రవేశం రాజకీయాల్లో కొత్తకాదు. అయితే.. ఎప్పుడూ.. ఇలాంటి సమస్య అసెంబ్లీ ఎన్నికల సమయం లోనే ఉంటుంది. తమ కుటుంబానికి చెందిన నాయకులను రంగంలోకి దింపేందుకునాయకులు సిద్ధంగా ఉంటా రు. అయితే.. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లోనూ వారసుల పరంపర పెరుగుతోంది. వచ్చే ఎన్నికలకంటే ముందుగానే తమ వారసులను లైన్‌లో పెట్టుకునేందుకు మెజారిటీ సీనియర్ నేతలు.. రెడీ అయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు నాటికి స్థానిక ఎన్నికలు జరగనున్నాయి.

ఈ నేపథ్యంలో తమ వారికి అవకాశం ఇవ్వాలంటూ..నాయకులు జాబితాలను, ప్రొఫైళ్లను పార్టీకి పంపిస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు.. ప్రస్తుతం ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. 130 మంది వారసులు రంగంలో ఉన్నారని.. పార్టీకి సమాచారం చేరింది. వీరిలో మెజారిటీ నాయకులు కార్పొరేషన్ మేయర్లు, మునిసిపాలిటీ చైర్మన్ పోస్టులకు ఎక్కువగా పోటీలో ఉండడం గమనార్హం. వాస్తవానికి ఇలాంటి పోస్టులకు.. ఎప్పుడూ డిమాండ్ ఉంటోంది.అయితే.. ఆయా పదవులు దక్కించుకునేందుకు ఎన్నికలు ముగిసిన తర్వాత తెరమీదకు వచ్చేవారు. కానీ, ఈ దఫా మేయర్, మునిసిపల్ చైర్మన్ పోస్టులను కూడా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలని చంద్రబాబు నిర్ణయించా రు. దీనికి సంబంధించిన జీవో కూడా ఇచ్చారు. అన్నీ రెడీ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆయా పోస్టులను దక్కించుకునేందుకు నాయకులు తమ వారసులను బరిలో నిలపాలని నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా కీలక నగరాలైన.. విజయవాడ, విశాఖ, కడప, కర్నూలు, నెల్లూరు, కృష్ణా, తిరుపతి వంటి ప్రాంతాల్లోపోటీ ఎక్కువగా ఉంది.ఒక పోస్టుకు ముగ్గురు నుంచి నలుగురు పోటీలో ఉండడం.. సిఫారసులు చేయించుకోవడంతోపాటు.. పార్టీపరంగా తాము ఏం చేస్తున్నామో కూడా వివరిస్తూ.. కొందరుఅధిష్టానాన్ని మెప్పించే పనిలో పడ్డారు. అయితే.. ఇక్కడ కీలక సమస్య తెరమీదికి వచ్చింది. వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకం కాకపోయిన.. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టించిన వారు.. వెనుక ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేనివారిని ప్రోత్సహించాలని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ, వారసత్వపు చిక్కులు ఆయనకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారంపై తేల్చాలని నిర్ణయించుకున్నారు. మరి ఏం చేస్తారన్నది చూడాలి.

## వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో యువకుల గల్లంతుపై మంత్రుల ఆరా

- మొదటి పేజీ తరువాయి

అంచనా వేయడం కష్టం కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫీడర్ కెనాల్, నల్లమల సాగర్ దగ్గర పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**మంత్రి గొట్టిపాటి ఆరా**

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌లో యువకులు గల్లంతుపై మంత్రి గొట్టిపాటి రవి ఆరా తీశారు. ఎస్పీ, అధికారులతో మాట్లాడారు. యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. గత రెండు రోజుల నుంచి డ్రోన్‌ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్లు మంత్రికి అధికారులు తెలిపారు. ఫీడర్ కెనాల్ వెంట పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఎస్పీని మంత్రి కోరారు.

## శాస్త్రవేత్తలను బీజేపీ రాజకీయ పావులుగా వాడుకుంటోంది

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శాస్త్రవేత్తలను రాజకీయ పావులుగా వాడుకుంటోందని, వారి జీతభత్యాలు, ఉద్యోగ భద్రత, పని పరిస్థితుల వంటి కీలక సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు, లోక్‌సభ ఎంపీ మాణికం ఠాగూర్ తీవ్రంగా విమర్శించారు. శాస్త్రవేత్తల శ్రమను గౌరవించకుండా, వారి విజయాలను తమ ఘనతగా ప్రచారం చేసుకుంటోందంటూ మండిపడ్డారు.ఆదివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా మాణికం ఠాగూర్ ఈ ఆరోపణలు చేశారు. "భారత్ ప్రయోగించే రాకెట్లు, చంద్రుడు, సూర్యుడిపైకి పంపే మిషన్ల గురించి దేశం గర్విస్తోంది. కానీ, ఆ విజయాల వెనుక రేయింబవళ్లు శ్రమించిన శాస్త్రవేత్తల త్యాగాలు, మానసిక ఒత్తిడి ఉన్నాయి. కుటుంబాలకు దూరంగా ఉంటూ వారు చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించడం లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ప్రతిష్ఠాత్మక ప్రయోగాల్లో భాగమైన శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ ఉద్యోగ భద్రత, సరైన జీతాల కోసం అధికారులకు వినతిపత్రాలు సమర్పించాల్సిన దుస్థితి రావడం ఆందోళనకరమని ఠాగూర్ ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ విజయాలను ప్రభుత్వం ఓవైపు వేడుకగా జరుపుకుంటూ, మరోవైపు ఆ విజయాలకు కారణమైన వారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు.కాంగ్రెస్ హయాంలో విక్రమ్ సారాభాయ్ వంటి దార్శనికుల కృషితో దేశ స్వావలంబన లక్ష్యంగా ఇస్రో ఒక ప్రభుత్వ రంగ సంస్థగా ఏర్పడిందని మాణికం ఠాగూర్ గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దాదాపు ఆరు దశాబ్దాల శాస్త్రవేత్తల కృషిని బలహీనపరిచేలా కార్పొరేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోందని, ఉద్యోగుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతోందని ఆరోపించారు.ప్రధాని నరేంద్ర మోదీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. "ప్రయోగాలు విజయవంతమైనప్పుడు శాస్త్రవేత్తల పక్కన నిలబడి కెమెరాలకు ఫోజులిచ్చే ప్రధాని, వారు తమ హక్కులు, ఉద్యోగాల గురించి మాట్లాడినప్పుడు మౌనంగా ఉంటున్నారు. విజయాల ఘనతను తీసుకునే ప్రభుత్వం, ఆ విజయాన్ని అందించిన వారి కష్టాలను కూడా గుర్తించాలి" అని హితవు పలికారు. ఇస్రో దేశ ప్రతిష్ఠకు, స్వావలంబనకు చిహ్నమని, దాని ప్రభుత్వ రంగ స్వరూపాన్ని, శాస్త్రీయ లక్ష్యాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ ప్రయోజనాల కోసం ఈ ప్రతిష్ఠాత్మక సంస్థను నిర్వీర్యం చేయడానికి అనుమతించకూడదని హెచ్చరించారు.

## తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికల్లో 'మన ప్యానెల్' హవా.. అధ్యక్షుడిగా సి. కల్యాణ్

తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (2026-28) నూతన కార్యవర్గం కోసం జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో 'మన ప్యానెల్', 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' మధ్య ప్రధాన పోటీ జరగ్గా, 'మన ప్యానెల్' స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించి కీలక పదవులను కైవసం చేసుకుంది. అధ్యక్ష పదవికి సి. కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 1,168 మంది సభ్యులకు గాను 643 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. అత్యంత కీలకమైన కోశాధికారి (ట్రెజరర్) పదవికి 'మన ప్యానెల్' నుంచి పోటీ చేసిన చదలవాడ శ్రీనివాసరావు విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవులకు 'మన ప్యానెల్' నుంచి మోహన్ వడ్లపల్లి, 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' నుంచి దామోదర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా 'మన ప్యానెల్' అభ్యర్థులు అమ్మిరాజు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ గెలుపొందారు.

ఇక కార్యవర్గ సభ్యుల (ఈసీ మెంబర్స్) పదవుల్లోనూ 'మన ప్యానెల్' హవా కొనసాగింది. ఈ ప్యానెల్ నుంచి పద్మిని, ఏషియన్ సునీల్, మోహన్ గౌడ్, శివలెంక కృష్ణప్రసాద్, దానయ్య సహా మొత్తం 12 మంది విజయం సాధించగా, 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' నుంచి మైత్రీ రవి, నిరంజన్ రెడ్డి, డీఎస్ రావు సహా ముగ్గురు గెలుపొందారు. అయితే, ప్రధాన కార్యదర్శి పదవి ఎన్నిక కోర్టు కేసు కారణంగా ప్రస్తుతానికి నిలిచిపోయింది.

ఈ సందర్భంగా అధ్యక్షుడు సి. కల్యాణ్ మాట్లాడుతూ, తమ ప్యానెల్‌కు దాదాపు 95 శాతం మద్దతు ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా చిన్న నిర్మాతలు ఎదుర్కొంటున్న విడుదల సమస్యలు, ఆర్థిక ఇబ్బందులపై దృష్టి సారిస్తామన్నారు. వారి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన బండ్ల గణేశ్‌కు ధన్యవాదాలు చెబుతూ, ఇకపై అందరం కలిసికట్టుగా పనిచేస్తామని పిలుపునిచ్చారు.

కోశాధికారిగా ఎన్నికైన చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ, తన గెలుపునకు ఎన్టీఆర్ ఆశీస్సులు, నందమూరి కుటుంబం మద్దతు కూడా కారణమని పేర్కొన్నారు. చిన్న నిర్మాతలకు అండగా ఉంటూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని, ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటామని తెలిపారు. మొత్తంగా, నిర్మాతల మండలిలో 'మన ప్యానెల్' విజయంతో చిన్న నిర్మాతల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మధ్యప్రదేశ్‌లో కల్తీ మద్యం కల్లోలం.. 12 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

తీవ్ర కలకలం రేపడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ప్రభావిత గ్రామాల్లో వైద్య పరీక్షలు ప్రారంభించి, ముందుజాగ్రత్త చర్యగా పలు మద్యం దుకాణాలను సీల్ చేశారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. "సంబంధిత మంత్రి, అధికారులను వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించాను. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇలాంటి వాటిని మా ప్రభుత్వం ఎంతమాత్రం సహించదు" అని ఆయన మీడియాకు తెలిపారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

**అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు**

ఈ మరణాల నేపథ్యంలో జిల్లాలో అక్రమ, నకిలీ మద్యం అమ్మకాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "బాంబే విస్కీ" పేరుతో ఓ నకిలీ బ్రాండ్‌ను విక్రయిస్తున్నారని, దీనిపై ఓ మద్యం కాంట్రాక్టర్ ఇటీవలే ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానిక కథనాలు పేర్కొంటున్నాయి. నాలుగు రోజుల క్రితం లైసెన్స్ పొందిన మద్యం కాంట్రాక్టర్లు సైతం ఎక్సైజ్ అధికారులతో జరిగిన సమావేశంలో నకిలీ మద్యం అమ్మకాలపై ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మిథైల్ ఆల్కహాల్‌గా అనుమానం**

కల్తీ మద్యం సేవించి అస్వస్థతకు గురైన వారిలో తీవ్రమైన లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు తెలిపారు. శరీరం నీలంగా మారడం (సైనోసిస్), కండరాలు బిగుసుకుపోవడం వంటివి గమనించినట్లు చెప్పారు. ఇది మిథైల్ ఆల్కహాల్ పాయిజనింగ్ కావచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నట్లు చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ దేవేష్ పటేరియా తెలిపారు.

"ప్రస్తుతం 9-10 మంది మరణించినట్లు మాకు సమాచారం ఉంది. మా వైద్య బృందాలు మూడు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత 24 నుంచి 48 గంటల్లో మద్యం సేవించి వాంతులు, తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి రావాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం నౌరా, ఘుగ్రు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు ఆ ప్రాంతంలోని ఆరు మద్యం దుకాణాలను సీల్ చేసి, అనుమానాస్పద మద్యం నమూనాలను పరీక్షల కోసం సేకరించారు. అసలు ఈ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు, పరిపాలన యంత్రాంగం దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు అందిన తర్వాతే మరణాలకు కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి

- మొదటి పేజీ తరువాయి

ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు.

సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు.

ప్రమాదం

జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

## కాంగ్రెస్ మాట విని తప్పుడు కేసులు పెడితే వదిలే ప్రసక్తే లేదు.. వడ్డీతో సహా చెల్లిస్తాం

అధికార కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లకు లొంగిపోయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ పోలీసు యంత్రాంగాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడులో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ హయాంలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్'తో పారదర్శకంగా విధులు నిర్వహించిన వ్యవస్థను, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం హింసను ప్రోత్సహించేలా వాడుకుంటోందని తీవ్రంగా ధ్వజమెత్తారు.

తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన పువ్వాడ... అధికార పార్టీ నేతల సైగలకు అనుగుణంగా తప్పుడు పనులు చేస్తున్న పోలీసు అధికారుల జాబితా తమ దగ్గర సిద్ధంగా ఉందన్నారు. చట్టాన్ని పక్కనపెట్టి బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తున్న ప్రతీ ఒక్కరికీ భవిష్యత్తులో వడ్డీతో సహా చెల్లిస్తామని ఘాటుగా హెచ్చరించారు. పోలీసులు ఇకనైనా ఏకపక్ష వైఖరిని విడనాడి, నిష్పాక్షికంగా చట్టపరిధిలో పనిచేయాలని సూచించారు.

## రాజమండ్రిలో కుండపోత.. రోడ్లన్నీ జలమయం

- మొదటి పేజీ తరువాయి

నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.సాయంత్రం పనుల మీద బయటకు వెళ్లినవారు, ఇళ్లకు తిరిగి వెళ్లేవారు అకస్మాత్తుగా కురిసిన వర్షంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిసారీ చిన్నపాటి వర్షానికే నగరం ఇలా జలదిగ్బంధంలో చిక్కుకోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం కారణంగానే ఈ దుస్థితి తలెత్తుతోందని వారు ఆరోపిస్తున్నారు.

## హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు.ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

## ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలు.. విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం

ఇండోనేషియాలోని అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. శుక్రవారం రాత్రి నుంచి ఉగ్రరూపం దాల్చిన ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద, ధూళి మేఘాల కారణంగా రాజధాని జకార్తాలో విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముందుజాగ్రత్త చర్యగా సోకర్నో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో 300కు పైగా విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడిన బూడిద ఆదివారం ఉదయం జకార్తా విమానాశ్రయ పరిసరాలను కమ్మేసింది. దీంతో అధికారులు తొలుత ఉదయం 9:30 గంటల వరకు, ఆ తర్వాత సాయంత్రం 5:30 గంటల వరకు విమాన రాకపోకలను నిలిపివేశారు. మొత్తం 301 విమానాలను రద్దు చేయగా, వాటిలో 58 అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి. ఈ పరిణామంతో 22,000 మందికి పైగా ప్రయాణికులపై ప్రభావం పడింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్ వంటి సంస్థలు జకార్తాకు తమ సర్వీసులను రద్దు చేసుకున్నాయి. సింగపూర్, దోహా, సిడ్నీ, కౌలాలంపూర్ వంటి ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

అగ్నిపర్వతం నుంచి బూడిద మేఘాలు జావా వైపు 20,000 అడుగులు, సుమత్రా వైపు 50,000 అడుగుల ఎత్తు వరకు వ్యాపించాయి. నిరంతర భూ ప్రకంపనలు, లావా వెదజల్లడం, భారీ శబ్దాలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. బూడిద కారణంగా కంటికి సంబంధించిన సమస్యలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మత్స్యకారులు కూడా సముద్రంలోకి వేటకు వెళ్లలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు, కళ్లజోళ్లు తప్పనిసరిగా ధరించాలని ఇండోనేషియా విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.ప్రస్తుతానికి సునామీ ముప్పు ఏదీ లేదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, ప్రజల్లో ఆందోళన నెలకొంది. 2018లో ఇదే అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా సంభవించిన సునామీలో 400 మందికి పైగా మరణించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ అగ్నిపర్వతాలు, భూకంపాలు సంభవించడం సాధారణమే.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

## ముచ్చివోలులో భారీ అగ్ని ప్రమాదం

**- విద్యుత్ తీగపై కాకి కారణంగా స్పార్క్.. గడ్డివామి దగ్ధం -సత్వర స్పందనతో తప్పిన పెను ప్రమాదం: దండి నరేంద్ర**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 06:**
శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో రైతు బాగిర్తి శంకరయ్యకు చెందిన గడ్డివామికి విద్యుత్ తీగపై ఉన్న కాకి కారణంగా ఏర్పడిన స్పార్క్‌తో మంటలు చెలరేగి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది.సమాచారం అందుకున్న జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు దండి నరేంద్ర వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గ్రామస్థుల అప్రమత్తత, అగ్నిమాపక సిబ్బంది సత్వర స్పందనతో పెను ప్రమాదం తప్పింది.ఈ సందర్భంగా దండి నరేంద్ర మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదాల నివారణకు విద్యుత్ తీగలను క్రమబద్ధీకరించాలని, సాధ్యమైన ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పటివరకు రైతులు విద్యుత్ తీగలకు సమీపంలో గడ్డివాములు ఏర్పాటు చేయకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# వివిధ రంగాల్లో విశిష్ట సేవలకు గౌరవ డాక్టరేట్

**- శ్రీకాళహస్తి వాస్తవ్యులు చక్రపాణి, జమ్షద్ అలీకి అరుదైన గౌరవం**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 06:**
వివిధ రంగాల్లో అందించిన సేవలను గుర్తించి శ్రీకాళహస్తి వాస్తవ్యులు చక్రపాణి, జమ్షద్ అలీలకు గౌరవ డాక్టరేట్ లభించింది. గోవాలోని ఓ ప్రముఖ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ద అమెరికన్ యూనివర్సిటీ (ఏ యు జి పి), యు ఎస్ ఏ, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో వారికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

### పాత్రికేయ రంగంలో చక్రపాణి సేవలు

చక్రపాణి ఒకవైపు రిపోర్టర్‌గా పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తూ, మరోవైపు మెడికల్ షాప్ నిర్వహిస్తూ ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుతూ తన వంతు సేవలందిస్తున్నారు. పాత్రికేయుడిగా స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.
కరోనా మహమ్మారి సమయంలోనూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విశేషంగా కృషి చేశారు. కరోనా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, మాస్కుల వినియోగం, భౌతిక దూరం, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు, విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

### సామాజిక సేవలో జమ్షద్ అలీ

జమ్షద్ అలీ టూర్, ట్రావెల్స్ రంగంలో సేవలందిస్తూ ఎంతోమందికి అండగా నిలిచారు. ముస్లిం సోదరులు మక్కా యాత్రకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లలో పలువురికి సహాయ సహకారాలు అందించారు. అదేవిధంగా పాస్‌పోర్ట్ సేవలను కూడా ఎంతోమందికి అందుబాటులోకి తీసుకువచ్చారు.
పేద, మధ్యతరగతి కుటుంబాలకు విదేశాలకు వెళ్లేందుకు వీలుగా తక్కువ ఖర్చుతో టూర్, ట్రావెల్స్ సేవలు అందిస్తూ తనవంతు సహకారం అందించారు. ఆయన సేవలను గుర్తించి ఈ గౌరవం




దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### అభినందనల వెల్లువ

చక్రపాణి, జమ్షద్ అలీలకు గౌరవ డాక్టరేట్ లభించడంతో మిత్రులు, ప్రజలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రంగాల్లో వారు అందిస్తున్న సేవలకు ఈ గౌరవం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని పలువురు పేర్కొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రత్నకుమార్.. మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా బాలసరస్వతి



**ఏర్పేడు, పెన్ పవర్ ,సెప్టెంబర్ 06:**
తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ పరిధిలోని రాజులకండ్రిగ ఆదర్శ పాఠశాలలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు అరుదైన గౌరవం దక్కింది. 28 ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయులు రత్నకుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.అదే పాఠశాలలో 18 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఆర్. బాలసరస్వతి మండల ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును అందుకున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు, డిజిటల్ బోధనను ప్రోత్సహించడం, పాఠశాలకు మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులను విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేలా ఆమె కృషి చేశారు.ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో విద్యార్థుల ఉన్నతికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. తనకు సహకరించిన తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఒకే పాఠశాలకు రెండు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



# పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుంది

**- సాంకేతిక పరికరాలకు దూరంగా.. పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలి**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 06:**
శ్రీకాళహస్తి పట్టణంలోని లంకమిట్టలో సోలార్ సొసైటీ ట్యూషన్ ఆధ్వర్యంలో జాతీయ పుస్తక పఠన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పుస్తక పఠనాన్ని నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.ట్యూషన్ మాస్టర్ షేక్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా ఎన్నో విషయాలను తెలుసుకోవడంతో పాటు విజ్ఞానం, జ్ఞానం పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు కొంత సమయం సాంకేతిక పరికరాలకు దూరంగా




ఉండి పుస్తకాలు చదవడంపై దృష్టి సారించాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరడంతో పాటు భవిష్యత్తులో దేశానికి, సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.విద్యార్థులు పుష్ప, శ్రీలత, వెంకటరమణ, చెంచమ్మ మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, మంచిగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజంలో ముందడుగు వేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్యూషన్ మాస్టర్ షేక్ అజారుద్దీన్, శైల, వాటంబేడు రత్నమ్మతో పాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి



**- అధికారులు మొద్దు నిద్ర వీడి అక్రమ మట్టి తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ నేతలు**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 06 :**
తొట్టంబేడు మండలం గుండేలిగుంట గ్రామానికి చెందిన చంద్రశేఖర్ మట్టి మాఫియా ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందడంపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.
డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మృతుని ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని వారు ఆరోపించారు. గత కొంతకాలంలోనే మట్టి తరలింపు వాహనాల కారణంగా సుమారు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, వారిలో ఒకరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాగా మరొకరు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఒప్పంద కార్మికుడు కావడం ఆందోళనకరమన్నారు.మృతుని పార్థివదేహం వద్ద నుంచే ఐజజ అధ్యక్షులు బాలగురవం బాబు సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఇంతటి ఘోర సంఘటనలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మొద్దు నిద్ర



వీడకపోవడం దురదృష్టకరమని, అక్రమ మట్టి తరలింపును అరికట్టి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త డి. కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, అరుణ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.




## నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

**" నెలవల దంపతులు కుమారుడు, మనుమడికి దీవెనలు"**

**నాయుడుపేట: పెన్ పవర్, సెప్టెంబర్ 6**
మాజీ ఎంపీ, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఇంట ఆదివారం పుట్టినరోజు వేడుకతో కోలాహలంగా మారింది. నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతుల ప్రథమ కుమారుడు, స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సోదరుడైన నెలవల రాజేష్‌పుట్టినరోజు వేడుక నాయుడుపేటలోని వారి స్వగృహంలో ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, అభిమానుల మధ్య భారీ కేక్ కోసి ఆనందాన్ని పంచుకున్నారు. నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని తల్లిదండ్రులు దీవించారు. ఇదే రోజునే మనుమడు జయదేవ్ పుట్టినరోజు వేడుకను కూడా సంయుక్తంగా నిర్వహించారు. నెలవల దంపతులు అటు కుమారుడు నిలబల రాజేష్, ఇటు మనుమడు జయదేవ్ పుట్టినరోజు వేడుకలో ఆశీర్వదించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొని శాలువా, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు 786 రఫీ, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## యువ పారిశ్రామికవేత్తలకు 'సమాఖ్య' మార్గదర్శకం

పెట్టుబడులు, వెంచర్ క్యాపిటల్, ఏంజెల్ ఇన్వెస్టర్లతో అనుసంధానానికి వేదిక: దండి నరేంద్ర




**తిరుపతి, పెన్ పవర్,సెప్టెంబర్ 06:**
యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్గదర్శకత్వం, లైజనింగ్, సహకారం అందించేందుకు 'సమాఖ్య' కీలక వేదికగా నిలుస్తుందని దండి నరేంద్ర పేర్కొన్నారు. తిరుపతి తాజ్ హోటల్‌లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమాఖ్య' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.యువత తమకు అనుకూలమైన వ్యాపార రంగాన్ని ఎంచుకోవడం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానం, పెట్టుబడిదారులు, వెంచర్ క్యాపిటల్, ఏంజెల్ ఇన్వెస్టర్లను చేరుకోవడం వరకు అవసరమైన సహకారాన్ని 'సమాఖ్య' అందిస్తుందని తెలిపారు. ప్రారంభ దశలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించి, గెన్ జెడ్ తో పాటు భవిష్యత్ తరాలకు విజయవంతమైన పారిశ్రామిక ప్రయాణానికి బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు.కార్యక్రమ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన పి.వి. రావు, టి.వి.ఎన్. రావు, రత్నం, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు దండి నరేంద్ర ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, ప్రముఖ వ్యాపారవేత్తలు డి.కె. శ్రీనివాసులు, ఎన్.వి. ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మోహన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే ఏ.ఎస్. మనోహర్, మాజీ ఎమ్మెల్సీ చెంగల్రాయులు, అరణి జగన్, ఆలివ్ స్వీట్స్ వ్యవస్థాపకులు దొరైరాజు తదితరులు, ఎన్ డి ఏ కూటమి నాయకులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.హైదరాబాద్ హైటెక్స్ లో అక్టోబర్ 14, 15 తేదీల్లో 'సమాఖ్య'ను మరింత విస్తృత స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు కార్యక్రమంలో భాగస్వాములై 'సమాఖ్య' అందించే అవకాశాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని దండి నరేంద్ర కోరారు.'సమాఖ్య' బలోపేతానికి ప్లాటినమ్ రూ.20 లక్షలు, గోల్డ్ రూ.10 లక్షలు, సిల్వర్ రూ.5 లక్షలు విభాగాల్లో సహకరించవచ్చని, రూ.10 వేల సభ్యత్వంతో సమాఖ్య సేవలను పొందే అవకాశం ఉందని వివరించారు.యువతలో పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించి, భవిష్యత్ తరాలకు బలమైన వ్యాపార వేదికను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని దండి నరేంద్ర పిలుపునిచ్చారు.

## రాజకీయాల్లో మంచి నాయకుడిగా రాణించాలి

**" ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ "**



**నాయుడుపేట: పెన్ పవర్, సెప్టెంబర్ 6**
కూటమి ప్రభుత్వ పాలనలో మంచి రాజకీయ నాయకుడిగా రాణించాలనిఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి సోదరుడు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తనయుడైన నెలవల రాజేష్ జన్మదిన వేడుక నాయుడుపేటలోని వారి గృహంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజేష్ కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆయురారోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలోని పాల్గొన్న టిడిపి పట్టణ అధ్యక్షుడు 786 రఫీ శుభాకాంక్షలు చెప్పారు. యువ నాయకుడు రాజకీయ కుటుంబంలో జన్మించినవారసుడు రాజేష్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని కూడా అభిలాషించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్, దినేష్, హేమంత్, వీర మహిళలు రోహిణి, హేమలత తదితరులు కూడా నెలవల రాజేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమాయత్తం కావాలి

**– ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి.. పార్టీ నాయకులకు దిశానిర్దేశం**







**తిరుపతి , పెన్ పవర్, సెప్టెంబర్ 06:**
తిరుపతిలో నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో, జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.సమావేశంలో ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రులు నారాయణస్వామి, ఆర్‌కే రోజాతో పాటు అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాల్సిన అంశంపై ప్రధానంగా చర్చించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలకు అవకాశం లేకుండా పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేసేలా నామినేషన్లు దాఖలు చేయాలని నాయకులకు సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు తప్పకుండా ఉంటుందని తెలిపారు.అదేవిధంగా పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ఆయా నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల పక్షాన నిలవాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి చేతుల మీదుగా పార్టీ సమన్వయకర్తలకు గుర్తింపు కార్డులను అందజేశారు.

# చందు కుటుంబానికి బొజ్జల కుటుంబం అండ

- ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ యువ నాయకుడికి బృందమ్మ నివాళులు.. కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం






**తొట్టంబేడు ,పెన్ పవర్, సెప్టెంబర్ 06:**
తొట్టంబేడు మండలం గుండెల గుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు చంద్రశేఖర్ (చందు) బైక్ ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లిగారు బొజ్జల బృందమ్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.
చందు నివాసానికి నేరుగా చేరుకున్న బృందమ్మ ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు.మరోవైపు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషిత రెడ్డి చందు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి తీవ్ర సంతాపం తెలిపారు. ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.
చందు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఎలాంటి ఆపద వచ్చినా తాము తోడుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## బాస్కెట్బాల్, స్కేటింగ్ గ్రౌండ్లను ప్రారంభించిన దస్తగిరి రెడ్డి, ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి..



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 6**
క్రీడల్లో విజేతలైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన డాక్టర్ దస్తగిరి రెడ్డి ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని శ్రీ గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్బాల్, స్కేటింగ్ గ్రౌండ్ లను అతిథులు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, భాష ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. గురురాజు ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కేటింగ్ కోర్టు, బాస్కెట్బాల్ కోర్టులను అతిధులు డాక్టర్ దస్తగిరి రెడ్డి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న శిక్షణను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. అలాగే ఉత్తమ విద్య విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సత్కరించారు.

## వైస్సార్సీపీ జిల్లా స్థాయి సమావేశం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 6**
ఈరోజు నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొనడం జరిగింది.

**ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఐసాక్ బాషా మాట్లాడుతూ:**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి స్థానంలోనూ వైఎస్సార్సీపీ గట్టి పోటీ ఇవ్వాలి.ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేసి స్థానిక పోరులో మన పార్టీ జెండాను రెపరెపలాడించాలి.పార్టీ కోసం రాత్రింబవళ్లు శ్రమించే ప్రతి కార్యకర్త కష్టాన్ని మన ప్రియతమ నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా గుర్తించి, వారికి తగిన ప్రాధాన్యత మరియు నాయకత్వ అవకాశాలు కల్పిస్తారు.

# అభివృద్ధి నోచుకోని రాజీవ్ గృహకల్పకు మహర్దశ: ప్రత్తిపాటి

- 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులకు మోక్షం

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 06 :**
చిలకలూరిపేట: గత 15 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని రాజీవ్ గృహకల్పలో రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేయించేందుకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప నివాసులు ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప నివాసులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యలను అప్పటి ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకున్నారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు రాజీవ్ గృహకల్పలోని సమస్యలను తెలుసుకుని రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తున్నందుకు ప్రత్తిపాటి పుల్లారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీకాళహస్తిలో బీజేపీ పట్టణ పదాధికారుల సమావేశం

- పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యం.. స్థానిక ఎన్నికల్లో విజయమే ధ్యేయం: కోలా ఆనంద్



**శ్రీకాళహస్తి,పెన్ పవర్,సెప్టెంబర్ 06:**
శ్రీకాళహస్తి పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పట్టణ పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ పాల్గొని పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, పదాధికారులతో విస్తృతంగా చర్చించారు.పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్తను ప్రజలకు చేరువ చేయాలని కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయభేరి మోగించేలా సమష్టిగా పనిచేయాలని సూచించారు.అలాగే సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా 'సేవా పఖ్వాడా' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పార్టీ పదాధికారులు, కార్యకర్తలు సేవాభావంతో ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, బీజేపీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజలకు వివరించాలని కోరారు.ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండ్రిగ ఉమ, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.వి. అమర్‌నాథ్, పట్టణ అధ్యక్షుడు హరీష్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కూనాటి నాగరాజు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రజ్ఞశ్రీ, ఉమా సింగ్, కోనేటి అయ్యప్ప, పుణ్యం ఢిల్లీ కుమార్, హుకుమ్ సింగ్ తదితర పార్టీ నాయకులు, పదాధికారులు పాల్గొన్నారు.

# వేధింపుల కారణంగా ఆత్మహత్య కేసు నలుగురు నిందితుల అరెస్టు

## గోస్పాడు పోలీస్ స్టేషన్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 6**
గోస్పాడు మండలం, జిల్లెల్ల గ్రామానికి చెందిన తెలుగు వెంకట రాముడు (56) అను వ్యక్తి తన గ్రామంలోని గంగమ్మ ఆలయ కార్యకలాపాలను వంశపారంపర్యంగా నిర్వహిస్తూ వస్తున్నాడు. ఆలయ నిధులను దుర్వినియోగం చేశాడని 7 మంది వ్యక్తులు అతనిపై నిరాధార నిందలు మోపి, గ్రామంలో బహిరంగంగా పలుమార్లు అవమానించి మానసిక వేదనకు గురిచేశారని ఫిర్యాదులో ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురైన సదరు వ్యక్తి సూసైడ్ నోట్ వ్రాసి 01/02.09.2026 అర్ధరాత్రి సమయంలో జిల్లెల్ల గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
మృతుని కుమారుడు తెలుగు హరి క్రిష్ణ (30) ఫిర్యాదు మేరకు గోస్పాడు పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ .చీ.68/2026 యూ /స్ 108 ఆర్/ డబ్ల్యు 3(5) బి.ఎన్.ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాము.వారిలో నలుగురిని ఈరోజు అనగా 06.09.2026వ తేదీన ఉదయం అరెస్టు చేసి, చట్టప్రకారం అన్ని నిబంధనలు పాటించి న్యాయస్థానం ముందు హాజరుపరచడమైనది. మిగిలిన నిందితులను త్వరలో అరెస్టు చేయుటకు ప్రత్యేక పోలీసు బృందాలు పనిచేస్తున్నాయి.

**అరెస్టు చేసిన నిందితులు:**
1) గోటికె మల్లికార్జున రెడ్డి, వయస్సు 41 సం., తండ్రి చిన్న క్రిష్ణారెడ్డి ఏ క్రిష్ణారెడ్డి, జిల్లెల్ల గ్రామం, గోస్పాడు మండలం.
2) మునగబోయిన నాగరాజు ఏ టోపీ రాజు, వయస్సు 56 సం., తండ్రి మద్దిలేటి ఏ బాలన్న, జిల్లెల్ల గ్రామం, గోస్పాడు మండలం.
3) మునగబోయిన నాగ మద్దిలేటి ఏ ట్యాంక్ పుల్లయ్య, వయస్సు 50 సం., తండ్రి బాల మద్దిలేటి ఏ బాలన్న, జిల్లెల్ల గ్రామం, గోస్పాడు మండలం.
4) అన్నలదాసు ఓబులేసు, వయస్సు 34 సం., తండ్రి బాల నరసింహుడు, జిల్లెల్ల గ్రామం, గోస్పాడు మండలం.

గమనిక:: గ్రామాల్లో ఆలయ, సంఘ నిధుల వ్యవహారాల పేరిట వ్యక్తులపై నిరాధార నిందలు వేయడం, బహిరంగంగా అవమానించడం, వేధించడం వంటి చర్యలు బి.ఎన్.ఎస్ సెక్షన్ 108 కింద తీవ్రమైన నేరమని, గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్షకు అవకాశం ఉందని ప్రజలకు తెలియజేస్తున్నాము. ఇలాంటి సంఘటనలపై కఠిన చర్యలు తీసుకోబడతాయి.సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు,గోస్పాడు పోలీస్ స్టేషన్, నంద్యాల జిల్లా.

# పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి: ఏఐటీయూసీ

- కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్




**నంద్యాల, పెన్ పవర్ సెప్టెంబర్ 6 :**
నంద్యాల పట్టణంలో పనిచేస్తున్న పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్లకు కనీస వేతనం అందించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.
నంద్యాల సీపీఐ కార్యాలయంలో పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యుడు మురళీధర్, నంద్యాల సిటీ ఏఐటీయూసీ అధ్యక్షుడు డి. శ్రీనివాసులు, కార్యదర్శి ధనుంజయ్ మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు వెంటనే పరిష్కరించాలని కోరారు.నంద్యాల పట్టణంలో కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్లకు మస్టర్ నమోదు చేయడం లేదని వారు ఆరోపించారు. కార్మికులందరికీ క్రమం తప్పకుండా మస్టర్ వేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.
అలాగే పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, ప్రతి నెలా నిర్ణీత సమయంలో వారి జీతాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. 60 సంవత్సరాలు పూర్తయిన కార్మికులను తొలగించకుండా వారికి ఉపాధి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.నంద్యాల పట్టణంలో మరమ్మతుల కారణంగా మూసివేసిన లేదా రిపేర్లలో ఉన్న పబ్లిక్ టాయిలెట్లను వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు ఆయా టాయిలెట్లలో పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యామ్నాయంగా పని కల్పించాలని కోరారు.పబ్లిక్ టాయిలెట్స్ వర్కర్లకు విధుల నిర్వహణకు అవసరమైన సబ్బులు, ఫినాయిల్, బ్రష్‌లు తదితర క్లీనింగ్ సామగ్రిని క్రమం తప్పకుండా అందించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారంలో మున్సిపల్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యుడు మురళీధర్, నంద్యాల సిటీ అధ్యక్షుడు డి. శ్రీనివాసులు, కార్యదర్శి ధనుంజయ్ కోరారు.

# పురుషులకు దీటుగా క్రీడల్లో మహిళలు రాణించాలి : డాక్టర్ ఏ. మాధవి లత



**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 6,**
పురుషులతో సమానంగా మహిళలు క్రీడా రంగంలో రాణించాలని, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శివ కిడ్నీ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఏ. మాధవి లత అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్, గుంటూరు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ మహిళల సిటీ లీగ్ పోటీలు ఆదివారం గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఏ. మాధవి లత పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అస్మిత సాఫ్ట్ టెన్నిస్ లీగ్ ద్వారా మహిళా క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, రాష్ట్రంలో సాఫ్ట్ టెన్నిస్ క్రీడ దినదినాభివృద్ధి చెందుతోందని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ కల్పిస్తోందని తెలిపారు.సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పలువురు మహిళా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సాఫ్ట్ టెన్నిస్ అంతర్జాతీయ క్రీడాకారిణి ఏ.ఎస్. వైశాలినిని సన్మానించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి డాక్టర్ ఏ. మాధవి లత తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు.

**విజేతల వివరాలు**
సబ్ జూనియర్ విభాగం: ప్రథమ స్థానం ఎన్. హాసిని , ద్వితీయ స్థానం వర్షిణి , తృతీయ స్థానం భాగ్యశ్రీ, నందిని
జూనియర్ విభాగం: ప్రథమ స్థానం ఆర్. హాసిని , ద్వితీయ స్థానం మహిమ, తృతీయ స్థానం శ్రావణి, శ్రీవర్ష
సీనియర్ విభాగం: ప్రథమ స్థానం ఆఫ్రిన్ ,ద్వితీయ స్థానం భువనశ్రీ, తృతీయ స్థానం తోరణ తన్మయి, కావ్యహర్షిత
కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్, అస్మిత సాఫ్ట్ టెన్నిస్ లీగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ డా. దారం నవీన్ కుమార్, జిల్లా కోర్టు అడ్వకేట్ సునీత, ఎస్‌బీఐ క్యాష్ ఆఫీసర్ జి. ఔనత్య, సీనియర్ ఉపాధ్యాయిని కరుణ, గుంటూరు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ కార్యనిర్వహక కార్యదర్శి కడియం జయరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి నరసింహరావు, వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, మణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరుకావాలి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 6:**

కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు అర్జీలలో తమ పేరు, పూర్తి చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరచాలని, సంబంధిత ఆధార పత్రాలను జత చేయాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఇదే సమస్యపై ఫిర్యాదు చేసిన వారు పాత అర్జీ లేదా ఫిర్యాదు రశీదును వెంట తీసుకురావాలని కోరారు. కలెక్టరేట్‌కు రాలేని వారు 1100 టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, అలాగే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా అర్జీలు సమర్పించే అవకాశం ఉందన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# వాస్తవాలను నిర్ధారించి

## వార్తలు ప్రచురించండి మీడియాకు జనసేన నేత బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 5:**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించిన రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్‌ఓ)తో ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతోందన్నారు. ప్రస్తుతం గుంటూరు నగరంలో 57 వార్డులు ఉండగా, డిలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా 76 వార్డులుగా పునర్విభజన చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం ఎన్నికల నిర్వహణ జరుగుతుందన్నారు.ప్రతి ఆర్‌ఓకు 3 నుంచి 4 వార్డుల వరకు కేటాయించే అవకాశం ఉందని, ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓల పాత్ర కీలకమని చెప్పారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరిగినా సంబంధిత ఆర్‌ఓదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఎలక్టోరల్ రోల్స్, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు, పోలింగ్ కేంద్రాల పరిశీలనతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు నగరపాలక సంస్థ నుంచి అవసరమైన అన్ని సదుపాయాలు, సహకారం అందిస్తామని కమిషనర్ తెలిపారు.



సమావేశంలో ఇంచార్జ్ అదనపు కమిషనర్ సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సి.హెచ్. శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలను పూజిద్దాం

## పర్యావరణాన్ని కాపాడుదాం ఎమ్మెల్యే గల్లా మాధవి



**గుంటూరు:పెన్ పవర్, సెప్టెంబర్, 6**

కొణిదే మోహన్ గోపి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన బ్రోచర్‌ను, మట్టి వినాయక విగ్రహ ప్రతిమను ఎమ్మెల్యే గల్లా మాధవి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని, వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని కోరారు. సంప్రదాయాలను కాపాడుకుంటూనే ప్రకృతిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పరుచూరి సంజీవరావు, టీడీపీ తెలుగు యువత నాయకులు వంశీ, కిషోర్, ఆనంద్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.నేటి నుంచి కృష్ణ గుంటూరు ఎన్టీఆర్ పల్నాడు బాపట్ల, నెల్లూరు తిరుపతి చిత్తూరు, కడప, కర్నూలు, నంద్యాల... జిల్లాల వారు రాత్రి 8:30 గంటల వరకు మాత్రమే వార్తలు పెట్టండి... అత్యవసరం అయితేనే క్రైమ్ వార్తలే రాత్రి 9:00 వరకు పెట్టండి. న్యూస్ డెస్క్ 9:00 గంటల కి క్లోజ్ చేయడం జరుగుతుంది

# గతం కంటే ఘనంగా దసర మహోత్సవాలు2026




**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 6:**

ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాలను గతం కంటే మరింత ఘనంగా, భక్తులకు సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. సామాన్య భక్తులకు సులభంగా, సంతృప్తికరంగా అమ్మవారి దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.దసరా ఏర్పాట్లపై మహా మండపంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, దేవస్థానం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆధునాతన క్యూ లైన్లు, హోల్డింగ్ ఏరియాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, అదనపు మరుగుదొడ్లు,అన్నప్రసాదం, ప్రసాదాల పంపిణీ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా వీఐపీ, వీవీఐపీ దర్శనాలను తగ్గించనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.శరన్నవరాత్రుల రోజుల్లో వీఐపీ దర్శనానికి రూ.1,000 టికెట్ అందుబాటులో ఉంటుందని, ఇతర క్యూ లైన్లను సాధారణ భక్తులు ఉచితంగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అయితే మూలా నక్షత్రం, విజయదశమి రోజుల్లో దర్శన టికెట్లు విక్రయించబోమని స్పష్టం చేశారు.వృద్ధులు, దివ్యాంగ భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, సహాయక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీ, ట్రాఫిక్, భద్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. సీసీటీవీలు, డ్రోన్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్సవాల నిర్వహణను పర్యవేక్షించనున్నారు.ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ గతేడాది కంటే అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. అన్నప్రసాదం, తాగునీరు వంటి సౌకర్యాలను తగిన స్థాయిలో అందుబాటులో ఉంచాలని అన్నారు.జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ ఏఐ ఆధారిత మానిటరింగ్‌తో క్యూ లైన్లలో భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. రద్దీ పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర హెచ్.ఎం, దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్, ఆర్డీవో వెన్నెల శ్రీను, దేవస్థానం కమిటీ చైర్మన్, ప్రధానార్చకులు, అధికారులు పాల్గొన్నారు.



# మెడికల్ కౌన్సిల్ అభ్యంతరాలు ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలి కొండి శెట్టి సురేష్ బాబు



**విజయవాడ: పెన్ పవర్, సెప్టెంబర్, 6**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర సమయంలో ప్రథమ చికిత్స అందించేందుకు గ్రామీణ వైద్యులకు నిర్వహిస్తున్న అవగాహన, శిక్షణా సదస్సులపై ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంపై జాతీయ ఆర్.ఎం.పి./పి.ఎం.పి. సంఘాల సమైక్య అధ్యక్షుడు కొండి శెట్టి సురేష్ బాబు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఆరోగ్య శాఖ మంత్రి కె. సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఆరోగ్య శాఖ కార్యదర్శి వీర పాండియన్‌లకు వినతిపత్రం సమర్పించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సిబ్బందికి ప్రస్తుత వైద్య విధానాలు, ఆరోగ్య నియమాలు, వ్యాధుల నివారణ, ప్రజలకు అందించాల్సిన ప్రథమ చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని, నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని కొందరికి మెడికల్ కౌన్సిల్ నుంచి నోటీసులు జారీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలకు ప్రథమ చికిత్స, ఆరోగ్య పరిరక్షణపై కనీస అవగాహన కల్పించే కార్యక్రమాలపైనా అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఆందోళనకరమన్నారు. గతంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రుల్లోనే గ్రామీణ వైద్యులకు శిక్షణ, పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి ధృవపత్రాలు అందించిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు.ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సురేష్ బాబు కోరారు. ప్రభుత్వం అనుమతించిన లేదా చట్టబద్ధమైన పరిధిలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ప్రథమ చికిత్స అందించేవారికి అవసరమైన శిక్షణ, ఆరోగ్య సంబంధిత అవగాహన కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని గ్రామీణ వైద్యులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.ఇదే విషయాన్ని టీవీ న్యూస్ యాంకర్ + వాయిస్ ఓవర్ ఫార్మాట్‌లో మరింత షార్ట్‌గా కూడా తయారు చేయవచ్చు.

# దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి :వల్లూరు జయ ప్రకాష్ నారాయణ



**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 6**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమం రాజేంద్రనగర్‌లోని గొట్టిపాటి కళ్యాణ మండపంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ, 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశ సేవలో నిరంతరం ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆయన 25 ఏళ్ల ప్రజాసేవా ప్రయాణం దేశ రాజకీయ చరిత్రలో విశిష్టమైన అ ద,ా్య యం వ ం ని పేరొ్కన్నారు. నబ్ కా సాథ్‌సబ్‌కా వికాస్‌సబ్‌కా విశ్వాస్‌సబ్‌కా ప్రయాస్" స్ఫూర్తితో అన్ని వర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా "సేవా సంకల్ప అభియాన్" నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రక్తదాన శిబిరాలు, స్వచ్ఛత కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు, యువత కోసం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల అనుభవాలను సమాజానికి తెలియజేస్తామని అన్నారు. "వికసిత్ భారత్2047" లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జిల్లా ఇన్‌చార్జి యాళ్ల దొరబాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ జిల్లాలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించి, పార్టీ పోటీ చేసే ప్రతి స్థానంలో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ర శివన్నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జులు భీమినేని చంద్రశేఖర్, గాజుల వెంకయ్య నాయుడు, పల్నాడు జిల్లా కో-ఇన్‌చార్జి ఆవుల నాగేంద్ర కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూపూడి రంగరాజు, యడ్లపాటి సరూప రాణి, పాలపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వై.వి. సుబ్బారావు, నడ్డి నాగమల్లిశ్వరి యాదవ్, ఫైరోజ్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, సేవా సంకల్ప అభియాన్ మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

# ప్రకృతి ఉత్పత్తులకు నేచర్లింక్ వేదిక

## గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 6:**

ప్రకృతి అనుకూల, పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముసాఫిబ్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేచర్లింక్ దుకాణాన్ని విజయవాడలో ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ ఉద్యానశాఖ సహాయ సంచాలకులు ఎం. వెంకటేశ్వర్లు, పర్యాటక శాఖ సహాయ సంచాలకులు నాయుడు, జిల్లా పర్యాటక అధికారి డా. కొల్లేటి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై దుకాణాన్ని ప్రారంభించారు.అరటి, వెదురు, జనపనార, కొబ్బరి తదితర సహజ నార పదార్థాలతో తయారు చేసిన బుట్టలు, సంచులు, చాపలు, తాళ్లు, హస్తకళా వస్తువులు, గృహోపకరణాలు తదితర ఉత్పత్తులు ఇక్కడ లభిస్తాయి.అరటి కాండం, ఇతర వ్యర్థ పదార్థాల నుంచి నారను సేకరించి విలువైన ఉత్పత్తులుగా మార్చడం ద్వారా రైతులు, గ్రామీణ మహిళలకు అదనపు ఆదాయం కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోంది. మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు భారతీయ సహజ ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు తెలిపారు.

# కాసుల పురుషోత్తమ కవి జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 6,**

భారత దేశ సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించేందుకు, తెలుగు భాషను వ్యాప్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృత నిశ్చయంతో పాటుపడతారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక విజ్ఞాన మందిరంలో కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలకు ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో చేపట్టిన ఈ కార్యక్రం మూడు రోజులుగా కొనసాగుతోంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాజుల అతిశయాన్ని రాజసంతో నిలదీసిన గొప్ప కవి కాసుల పురుషోత్తములని కొనియాడారు. డాక్టర్ కాసుల కృష్ణంరాజు మిమిక్రీ ఆర్టిస్టుగానే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అత్యంత మక్కువ కలిగి ఉన్నారని తెలిపారు. ఎన్నో ప్రాంతాల నుంచి కళాకారులు ఇక్కడకు వచ్చినందుకు అభినందనలు చెప్పారు. బుర్రకథ, హరికథ, తప్పెటగుళ్ళు, కోలాటం వంటి అంతరించిపోతున్న జానపద కళారూపాలను ఆదరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సాంప్రదాయ కళలైన కూచిపూడి, కర్ణాటక సంగీతం, తోలుబొమ్మలాట వంటి ప్రక్రియలను రక్షించడానికి ప్రభుత్వ సంగీత-నృత్య కళాశాలల ద్వారా శిక్షణ అందిస్తోందని చెప్పారు.

# మంచినీటి సమస్య లేకుండా

## ముందస్తు చర్యలు : ప్రత్తిపాటి

**- ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్ని పరిశీలించిన ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 06 :**
ఎల్ నినో తీవ్రత దృష్ట్యా పట్టణ మరియు నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, సాగర్ నుంచి విడుదలయ్యే నీటితో అన్ని మంచినీటి చెరువుల్ని నింపుతున్నామని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.ఆదివారం శాసనసభ్యులు పట్టణ శివార్లలోని రెండు తాగునీటి చెరువులు, పసుమర్రు మంచినీటి చెరువుల్లో నీటిని నింపే పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి సరఫరా జరగాలని, సాగర్ నుంచే వచ్చే నీరు వృథా కాకుండా నేరుగా చెరువులకు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రస్తుతం ఉన్న చెరువులు పూర్తిగా నిండితే, పట్టణ ప్రజలకు 100 రోజుల వరకు ఎలాంటి నీటి సమస్యలు ఉండవన్న ప్రత్తిపాటి. చెరువుల నుంచి నీటిని తరలించే క్రమంలో ఎలాంటి వృథా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా వాడుకునేలా చూడాలన్నారు.చెరువుల పరిశీలనకు వెళ్లిన ప్రత్తిపాటి వెంట నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు, పిల్లి కోటేశ్వరరావు, ఎస్.ఎస్. సుభాని, మున్సిపల్ డి.ఈ అబ్దుల్ రహీమ్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి నోచుకోని

## రాజీవ్ గృహకల్పకు మహర్దశ: ప్రత్తిపాటి

**- 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులకు మోక్షం**



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 06 :**
చిలకలూరిపేట: గత 15 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని రాజీవ్ గృహకల్పలో రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేయించేందుకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప నివాసులు ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప నివాసులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యలను అప్పటి ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకున్నారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు రాజీవ్ గృహకల్పలోని సమస్యలను తెలుసుకుని రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తున్నందుకు ప్రత్తిపాటి పుల్లారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# వైస్సార్సీపీ జిల్లా స్థాయి సమావేశం




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 6**
ఈరోజు నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొనడం జరిగింది.

**ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఐసాక్ బాషా మాట్లాడుతూ:**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి స్థానంలోనూ వైఎస్సార్సీపీ గట్టి పోటీ ఇవ్వాలి.ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేసి స్థానిక పోరులో మన పార్టీ జెండాను రెపరెపలాడించాలి.పార్టీ కోసం రాత్రింబవళ్లు శ్రమించే ప్రతి కార్యకర్త కష్టాన్ని మన ప్రియతమ నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా గుర్తించి, వారికి తగిన ప్రాధాన్యత మరియు నాయకత్వ అవకాశాలు కల్పిస్తారు.

# రూ.52 కోట్లతో పట్టణాభివృద్ధికి శ్రీకారం చుట్టాం : ప్రత్తిపాటి

- రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాం
- జగన్ పాలనలో పట్టణాల్లోని పేద, మధ్యతరగతి వర్గాలు ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారు
- పట్టణంలో రూ.1.04కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 06 :**
చిలకలూరిపేట పట్టణాభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టామని, దానిలో భాగంగా ఇటీవల ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.52 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, నేడు పలువార్డుల్లో రూ.1.04 కోట్ల మైనింగ్ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేయడం జరిగిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.పట్టణాభివృద్ధిలో భాగంగా ఆదివారం ఆయన నాలుగు వార్డుల్లో రూ.1.04 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్లకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా వార్డుల్లో ప్రత్తిపాటి టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశం నిర్వహించారు.

**అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.**
చిలకలూరిపేట పట్టణ రూపురేఖలు మార్చే దిశగా నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, కోటి 4 లక్షల మైనింగ్ నిధులతో, 9, 18, 21, 23 వార్డుల్లో నిర్మించే ప్రధాన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశామని ప్రత్తిపాటి చెప్పారు. ఇటీవల ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.52 కోట్ల ప్రత్యేక నిధులతో చేపట్టబోయే పనులకు ఇప్పటికే టెండర్లు పిలవడం జరిగిందన్నారు. ఈ నిధులతో ప్రధానంగా సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు. ఈ పనులన్నీ పూర్తయితే పట్టణంలో ఎక్కడా ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. పనిచేసే ప్రభుత్వంలో పట్టణాలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయో ప్రజలు గమనించాలని ప్రత్తిపాటి కోరారు.

**చంద్రబాబు పాలనలోనే పట్టణాల అభివృద్ధి.**
పట్టణ ప్రజలే రాష్ట్ర అధికార నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని, వారు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ పెట్టిందని ప్రత్తిపాటి చెప్పారు. రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన నాయకుడు చంద్రబాబు మాత్రమేనని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాయని ప్రత్తిపాటి చెప్పారు. గత ప్రభుత్వంలో పట్టణాలు సమస్యల కూపాలుగా మారాయని, చివరకు చెత్తసేకరణ కూడా సక్రమంగా జరగలేదన్నారు. జగన్ పాలనలో పట్టణాల్లో నివసించే పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపాధి కూడా దొరకలేదని, రోజువారీ కూలీలు అర్ధాకలితో అలమటించారని ప్రత్తిపాటి తెలిపారు. పట్టణ ప్రజలపై పన్నులభారం మోపి, ఖజానా నింపుకున్న జగన్.. వారి సమస్యల్ని మాత్రం గాలికి వదిలేశాడన్నారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు సయ్యద్ వహాబ్, మారెళ్ళ అప్పారావు, అరెకతల కోటేశ్వరరావు, కరిముల్లా, ఎస్.ఎస్. సుభాని, మద్దిబోయిన చంద్రశేఖర్, ముల్లా కరిముల్లా, ఒంటిపులి వెంకట, గోపిదేశి వెంకటేశ్వర్లు, మామిళ్ళ దాసు, ఫ్రాన్సిస్, మండవ వెంకట్రావు, శిఖా నాగరాజు, కొత్త కోటేశ్వరరావు, సిల్వర్ హరి, అర్వపల్లి అప్పారావు, కనమర్లపూడి రమేష్, రాచుమల్లు సూర్య రావు, కంచర్ల శ్రీనివాసరావు, మోహన్ కృష్ణ, కంచర్ల కరుణ, బొల్లయ్య, బీజేపీ నాయకులు గట్టా హేమ, డి.ఈ అబ్దుల్ రహీమ్, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ చైతన్యంతోనే బలమైన ప్రజాస్వామ్యం

- అక్టోబర్‌లో స్థానిక ఎన్నికల నేపథ్యంలో చీరాలలో ప్రజా సంఘాల ఐక్యవేదిక చైతన్య కార్యక్రమం
- రాజ్యాంగం సర్వోన్నతం.. ఓటరు చైతన్యం పెరగాలి: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి




**చీరాల, సెప్టెంబర్ 6, (పెన్ పవర్) :**
త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కుపై చైతన్యం కల్పించేందుకు చీరాలలో ప్రజా సంఘాలమిత్రుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం సౌజన్యంతో చీరాల ఘంటసాల సెంటర్‌లో "భారత రాజ్యాంగంప్రజాస్వామ్యంఎన్నికలుఓటరు చైతన్యం" అనే అంశంపై బ్యానర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమానికి ప్రముఖ సామాజిక కార్యకర్త శీలం రవికుమార్ అధ్యక్షత వహించగా, సీనియర్ సిటిజన్స్, ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షులు గాదె హరిహరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శీలం రవికుమార్ మాట్లాడుతూ త్వరలో రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో చీరాల ప్రజల్లో ప్రజాస్వామిక చైతన్యం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, నవ్యాంధ్ర చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఐక్యవేదికల నిర్మాణం ద్వారా సుమారు 30 కేంద్రాల్లో రాజ్యాంగ చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం సర్వోన్నతం, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి, ఓటరు చైతన్యం పెరగాలి, ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న ఐదు ప్రమాదాలపై అవగాహన, భవిష్యత్తులో దామాషా ఎన్నికల విధానం ఆవశ్యకత అనే ఐదు ప్రధాన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.80 ఏళ్ల స్వతంత్ర భారతం నాడునేడురేపు అనే అంశం నేపథ్యంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఎన్నికలు, ఓటరు చైతన్యంపై వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని అంశాల్లో భారత రాజ్యాంగమే సర్వోన్నతమని స్పష్టం చేశారు.కొత్తపేట మాజీ సర్పంచ్ ఊటుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు, ప్రజల భాగస్వామ్యానికి కల్పించిన ప్రజాస్వామిక హక్కులపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. చీరాల ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కూడా తగిన కార్యక్రమాలు రూపొందించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలపోలు నాగ మనోహర లోహియా, గురజాల శ్రీనివాసరావు, పాలెపు కనక మోహన్ రావు, కె. రామచంద్రయ్య, కుక్కల శ్రీరామచంద్రమూర్తి, అల్లూరయ్య, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించాలి

## -ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు వినతిపత్రం అందజేసిన ప్రతినిధులు



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 06 :**
రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ పల్నాడు జనరల్ సెక్రటరీ, టీడీపీ పల్నాడు జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు వేముల బాలరాజు నేతృత్వంలో అసోసియేషన్ ప్రతినిధులు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను కలిశారు.ఈ సందర్భంగా పల్నాడు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలు, వీల్‌చైర్లు, రన్నింగ్ ఫ్రేములు, త్రోయింగ్ చెయిర్లు తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఎంపీకి వినతిపత్రం అందజేశారు.పారా క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ అవకాశాలు, క్రీడా అభివృద్ధికి అవసరమైన అంశాలను ప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.వినతిపై స్పందించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కోరిన క్రీడా పరికరాలు, అవసరమైన సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి తనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ వారి సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేముల బాలరాజు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధుల సేవలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గం విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు యేనుగంటి వెంకట కృష్ణారావు, చిలకలూరిపేట నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి చిన్న అప్పయ్య, దాసరి కార్తీక్ తదితర విభిన్న ప్రతిభావంతులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పురుషులకు దీటుగా క్రీడల్లో మహిళలు రాణించాలి : డాక్టర్ ఏ. మాధవి లత



**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 6,**
పురుషులతో సమానంగా మహిళలు క్రీడా రంగంలో రాణించాలని, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శివ కిడ్నీ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఏ. మాధవి లత అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్, గుంటూరు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ మహిళల సిటీ లీగ్ పోటీలు ఆదివారం గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఏ. మాధవి లత పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అస్మిత సాఫ్ట్ టెన్నిస్ లీగ్ ద్వారా మహిళా క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, రాష్ట్రంలో సాఫ్ట్ టెన్నిస్ క్రీడ దినదినాభివృద్ధి చెందుతోందని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ కల్పిస్తోందని తెలిపారు.సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పలువురు మహిళా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సాఫ్ట్ టెన్నిస్ అంతర్జాతీయ క్రీడాకారిణి ఏ.ఎస్. వైశాలినిని సన్మానించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి డాక్టర్ ఏ. మాధవి లత తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు.

**విజేతల వివరాలు**

సబ్ జూనియర్ విభాగం: ప్రథమ స్థానం ఎన్. హాసిని , ద్వితీయ స్థానం వర్షిణి , తృతీయ స్థానం భాగ్యశ్రీ, నందిని

జూనియర్ విభాగం: ప్రథమ స్థానం ఆర్. హాసిని , ద్వితీయ స్థానం మహిమ, తృతీయ స్థానం శ్రావణి, శ్రీవర్ష

సీనియర్ విభాగం: ప్రథమ స్థానం ఆఫ్రిన్ ,ద్వితీయ స్థానం భువనశ్రీ, తృతీయ స్థానం తోరణ తన్మయి, కావ్యహర్షిత

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్, అస్మిత సాఫ్ట్ టెన్నిస్ లీగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ డా. దారం నవీన్ కుమార్, జిల్లా కోర్టు అడ్వకేట్ సునీత, ఎస్‌బీఐ క్యాష్ ఆఫీసర్ జి. ఔనత్య, సీనియర్ ఉపాధ్యాయిని కరుణ, గుంటూరు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి కడియం జయరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి నరసింహారావు, వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, మణి తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ రేసులో వాసుపల్లి...జగన్ వ్యూహం ?

విశాఖ మేయర్ సీటు మీద వైసీపీ కూడా ఫుల్ ఫోకస్ పెట్టేసింది. 2021లో గెలిచిన ఆ పార్టీ జనరల్ సీటులో బీసీ మేయర్ ని మహిళను అనూహ్యంగా తెచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పార్టీ బీసీలకు పెద్ద పీట వేస్తుందని అలా చెప్పుకుంది. ఇపుడు మరోసారి బీసీల వైపే వైసీపీ చూపు ఉందని అంటున్నారు. అదే విధంగా స్థానిక అభ్యర్థికి ఛాన్స్ ఇవ్వడం ద్వారా దానిని కూడా ఎన్నికల అస్త్రంగా మార్చుకోవాలని చూస్తోంది. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే విశాఖ దక్షిణ నియోజక వర్గానికి చెందిన వాసుపల్లి గణేష్ కుమార్ పేరు అయితే వైసీపీలో చురుకుగా పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. ఆయన 20014, 2019లలో రెండు సార్లు దక్షిణం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీ విశాఖ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. నగర రాజకీయాల మీద ఆయనకు పట్టు ఉంది అని అంటారు.

**ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో :**

విశాఖలో వైసీపీకి ఉన్న బలమైన నేతగా వాసుపల్లి పేరు వినిపిస్తుంది. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు చేయడమే కాదు సొంతంగా నియోజకవర్గం సమస్యల మీద ఆయన గట్టిగా పోరాడుతారు. ప్రజలతో అను నిత్యం సంబంధాలను కొనసాగిస్తూ ఉంటారు. దాంతో పాటు అంగబలం అర్ధబలం కూడా ఉండడంతో ఆయన పేరుని సీరియస్ గానే పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. నిజానికి మరో మాజీ ఎమ్మెల్యే కూడా మేయర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి చూస్తున్నారు అని ప్రచారంలో ఉంది. ఆయన వెలమ సామాజిక వర్గానికి చెందిన బీసీ నేత తైనాల విజయకుమార్. ఆయన కార్పోరేటర్ గా ఉంటూ అనూహ్యంగా 2009లో విశాఖ ఉత్తరం నుంచి ఎమ్మెల్యే అయిపోయారు. ఇపుడు ఆయన చూపు మళ్ళీ కార్పోరేషన్ రాజకీయాల మీద పడింది అని అంటున్నారు. జీవీఎంసీలో పట్టు ఉందని సొంత సామాజిక వర్గం సహకారం ఉందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మద్దతు కూడా ఆయనకు ఉందని చెప్పుకుంటున్నారు.

**ఫైర్ బ్రాండ్ లీడర్ గా :**

అయితే ఈ ఇద్దరిలో అధినాయకత్వం మొగ్గు వాసుపల్లి వైపే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఆయన దక్షిణ నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి గా ఉన్నారు. ఫైర్ బ్రాండ్ లీడర్ అని చెబుతారు. కూటమి మీద ధీటుగా విమర్శలు చేస్తారు అని పేరు. దాంతో పాటు ఆయన కూడా పోటీ చేస్తాను అని ఇప్పటికే ప్రకటించేసారు. తమ నాయకుడు జగన్ కనుక పోటీకి సిద్ధం కావాలని కోరితే తాను మేయర్ గా బరిలో ఉంటాను అని అన్నారు. విశాఖ అభివృద్ధికి సంబంధించి తనకు అజెండా ఉందని కూడా వాసుపల్లి అంటున్నారు.

**పక్కా ప్లాన్ తోనే :**

వాసుపల్లిని బరిలోకి దించాలన్నది వైసీపీ పక్కా ప్లాన్ తోనే చేస్తోంది అని అంటున్నారు. కూటమి నుంచి ఓసీకి ఇస్తే నాన్ లోకల్ కి ఇస్తే అది వైసీపీకి ప్లస్ అవుతుందని అదే జనంలో పెట్టి ప్రచారం చేయవచ్చు అన్నది కూడా వ్యూహంగా ఉంది అంటున్నారు.ద

కూటమిలో టీడీపీ పోటీ చేస్తుందని అంటున్నారు. ఓసీల నుంచే ఎక్కువ పోటీ ఉంది. దాంతో పాటు విశాఖలో స్థిరపడిన వారు కూడా పోటీకి ఉత్సాహం చూపిస్తున్నారు. దాంతో వారికే కనుక టికెట్ ఇస్తే వైసీపీ వలస నేతలు అని ప్రచారం చేయడానికి రెడీగా ఉంది అని అంటున్నారు. అందుకే వైసీపీ తన చేతిలో బీసీ కార్డుతో పాటు లోకల్ కార్డు కూడా ఉంచుకుందని చెబుతున్నారు. మేయర్ ఎన్నికలు అంటే డబ్బుతో ఖర్చు కాబట్టి వాసుపల్లి ఉత్సాహంగా ఉన్నారు కాబట్టి ఆయనకే వైసీపీ టికెట్ ఇచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని అంటున్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పవన్ రెడీ అంటే.. దూకుడే!



జనసేన అధినేత పవన్‌కల్యాణ్ –రెడీ– అంటే చాలు.. రంగంలోకి దిగేందుకు భారీ సంఖ్యలో నాయకులు కాచుకుని కూర్చున్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు..నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లాల వరకు అన్ని కమిటీలను ఇటీవల పార్టీ అధినేత రద్దు చేసిన విషయం తెలిసిందే. వీటిలో కీలక నాయకులు, మేధావులు, పార్టీ అధికార ప్రతినిధులు కూడా ఉన్నారు. అయితే.. కొత్తగా కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారే కానీ.. ఇప్పటి వరకు ఆ దిశగా పార్టీ చర్యలు తీసుకోలేదు.దీంతో పదవుల కోసం ఎదురు చూస్తున్నజనసేన నాయకులు.. పవన్ కల్యాణ్ నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు రానున్నాయి. ఈ నేపథ్యంలో కమిటీల ఏర్పాటు పార్టీకి, ముఖ్యంగా పవన్‌కల్యాణ్ రాజకీయ వ్యూహాలకు కూడా అత్యంత అవసరంగా మారింది. అయితే.. గతంలో తాను ఏర్పాటు చేసిన కమిటీల్లోని నాయకులు దారి తప్పుతున్నారని.. పార్టీపరంగానేకాకుండా.. కీలకమైన కూటమికే ఇబ్బందులు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని భావించిన పవన్ .. వాటిని ఒక్క నిర్ణయంతో రద్దు చేశారు.కానీ, ఎక్కువ కాలం వేచి చూసేందుకు.. కమిటీలు లేకుండా పార్టీని నిలబెట్టేందుకు అవకాశం తక్కువగానే ఉంది. స్థానికంగా జరిగే ఎన్నికల్లో నాయకుల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అలాంటి నాయకులు ఇప్పుడు కమిటీలను రద్దు చేయడంతో సుప్తచేతనావస్థలో ఉన్నారన్నది పార్టీకిఅందుతున్న నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామ, పట్టణస్థాయి కమిటీల్లో చైతన్యం నింపాల్సిన అవసరం ఉందన్నది వాస్తవం. ఇవి స్థానికెన్నికలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.వీటిని ఏర్పాటు చేయడం ద్వారా.. పార్టీపరంగా పుంజుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే.. పార్టీ సిద్ధాంతాల కు..కమిటీ నాయకులకు ముడిపెడుతున్న పవన్.. ఈ విషయంలో తగ్గేదేలేదని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా కూటమిగా ముందుకు సాగాలన్నదే పవన్ లక్ష్యంగా ఉంది. ఈ దిశగానే కమిటీలను ఏర్పాటు చేయాలని తలపోస్తు న్నారు. కానీ, ఎప్పటికి ఏర్పాటు చేస్తారు? అనేదిప్రశ్న. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 300 మందికిపైగా నాయకులు, క్షేత్రస్థాయి కేడర్‌ఈ కమిటీల ఏర్పాటు కోసం నిరీక్షిస్తున్నారు. పవన్ సై అంటే.. సై సై అంటూ.. రంగంలోకి దిగాలని భావిస్తున్నారు. మరి పవన్ కల్యాణ్ ఎప్పుడు నిర్ణయిస్తారు? అనేది చూడాలి.

## అడగడానికి ఏం లేదు.. చంద్రబాబు చేసేశారు!




ఇదేదో సినిమా డైలాగు కాదు. నిజమే!. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న పలు కీలక సమస్యలకు సీఎం చంద్రబాబు పరిష్కారం చూపించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పే-రివిజన్ కమిషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డీఏల విడుదలకు అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల ను సీఎం వారికి వివరించారు. రాష్ట్ర ఆదాయ-వ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా.... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 1-7-2024, 1-1-2025లకు చెందిన రెండు డీఏల విడుదలకు ఆమోదం తెలిపారు.

**సంక్రాతి పండగే!**

ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. ఇక 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాలో వేయడానికి అంగీకరించారు. ఇక పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇక గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి ఇచ్చేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింప చేయనున్నారు. ఇక ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేస్తూ వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపులు జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయాలతో ఏటా రూ.2,880 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు కానుంది. అయినప్పటికీ.. చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఆయన చెప్పడానికి ఏమీ లేకుండా.. ఉద్యోగులు అడగానికి కూడా లేకుండా చేసేసినట్టు అయింది.

# జగన్ స్థానిక ప్రచారం ?



స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా 2024 ఎన్నికల కంటే పెరిగిన తమ బలాన్ని చాటాలని అనుకుంటోంది. అంతే కాదు కూటమి రెండేళ్లకు పైగా సాగిన పాలనలో ప్రజా వ్యతిరేకత గణనీయంగా ఉందని వైసీపీ నమ్ముతోంది. దాంతో తమ పార్టీకి అనూహ్యమైన ఫలితాలు వస్తాయని కూడా ధీమా వ్యక్తం చేస్తోంది. అందుకే జగన్ కూడా మొత్తం 175 అసెంబ్లీ ఇంచార్జిలకు గట్టిగానే చెబుతున్నారు. ఎక్కడా ఏకగ్రీవాలు వద్దు అని కూడా స్పష్టం చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉందని కూడా వారికి తెలియజేస్తూ సరైన వ్యూహాలతో అంతా కలిసి సమిష్టిగా పోరాడితే వైసీపీకి మంచి ఫలితాలు వస్తాయని కూడా అంటున్నారు.

**సీట్ల సర్దుబాటు మీదనే :**

కూటమిలో మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అనుకున్నంత ఈజీ కాదని వైసీపీ భావిస్తోంది. అంతే కాకుండా లోకల్ బాడీ ఎన్నికలు కాబట్టి దిగువ స్థాయిలో నాయకులు తమకు బలం ఉందనుకుంటే పార్టీని పక్కన పెట్టి మరీ రెబెల్స్ గా పోటీ చేయవచ్చు అని అంటున్నారు. అలా కూటమిలో పార్టీలకు పనిచేయాలని పై స్థాయిలో ఎంత చెప్పినా దిగువకు వచ్చేసరికి అది అనుకున్నంతగా వర్కౌట్ కాకపోవచ్చు అని అంటున్నారు. మిత్రులకు ఎక్కువ సీట్లు ఇస్తే ఓట్ల బదిలీ జరగకపోగా రెబెల్స్ పెరుగుతారని అలాగని తక్కువ సీట్లే కూటమి ఐక్యంగా పోటీకి అవరోధంగా మారుతుందని కూడా వైసీపీలో చర్చ సాగుతోంది. ఏ విధంగా చూసినా 2024లో జరిగినంత కట్టుగా ఈసారి మూడు పార్టీల మధ్య ఓట్ల బదిలీ కానీ పోటీ కానీ జరిగే వీలు లేదన్నది వైసీపీ అంచనాగా ఉంది. దాంతో తమకు ఇక్కడే అడ్వాంటేజ్ ఉంటుందని కూడా లెక్క వేసుకుంటోంది.

**జగన్ దిగితేనే :**

అయితే వైసీపీకి ఎన్ని అంచనాలు ఉన్నా ఎంతలా క్యాడర్ ని లీడర్ ని యాక్టివ్ చేసి రంగంలోకి దించినా జగన్ కూడా కీలక సమయంలో జనంలోకి రాకపోతే పార్టీకి అది ఇబ్బందిగా మారుతుందని అంటున్నారు. ఎందుకంటే మేయర్ జెడ్పీలు అన్నవి కీలకంగా ఉంటాయి. జిల్లా నగరాలలో ముఖ్య కేంద్రాల రాజకీయాలను ఇవి ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఇక్కడ ఎంతో కొంత సానుకూలత వైసీపీకి రావాలీ అంటే జగన్ ముఖ్యమైన చోట్ల అయినా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే బాగుంటుంది అన్న భావన అయితే పార్టీలో ఉంది. జగన్ మొత్తానికి మొత్తం తిరగకపోయినా కీలక జిల్లాలలో ముఖ్యమైన రీజియన్లలో సభలు పెడితే కనుక వైసీపీ విజయావకాశాలను విశేషంగా ప్రభావం చేస్తుందని విశ్లేషిస్తున్నారు.

**నిజంగా వస్తారా :**

అయితే జగన్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి నిజంగా వస్తారా అన్నది అయితే తెలియదనే అంటున్నారు. జగన్ 2021 ఎన్నికల్లో కూడా లోకల్ బాడీ ఎన్నికల్లో ప్రచారం చేయలేదు, అయితే అప్పట్లో పార్టీ అధికారంలో ఉంది అన్ని బలాలూ అనుకూలించాయని అంటున్నారు. ఇపుడు అలా కాదని వైసీపీకి ఈ ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవి అని కూడా చెబుతున్నారు. అందువల్ల జగన్ వస్తేనే బాగుంటుంది అన్నది పార్టీలో నేతల మాటగా ఉంది అని ప్రచారం సాగుతోంది. రెండేళ్ళకు పైగా సాగిన కూటమి పాలన మీద జగన్ చేసే విమర్శలు ఆయన ప్రసంగాలు అయితే జనంలోకి బాగా వెళ్తాయని అంటున్నారు. అలా వైసీపీకి అనుకూలత ఏర్పడుతుందని భావిస్తున్నారు. మరి జగన్ ప్రచారానికి వస్తారా రారా అన్నది అపుడే తేలుతుందని అంటున్నారు.

# కూటమిలో పవన్ కృష్ణ సారధ్యం.. అక్కడ కీ రోల్...!

జనసేన పార్టీ

ఆంధ్రప్రదేశ్‌లో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను ఉమ్మడిగా ముందుకు తీసుకురావడంలోను, భారీ విజయం దక్కించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలోనూ కీలక పాత్ర పోషించిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అత్యంత కీలక పాత్ర పోషించనున్నారన్నది కూటమిలో జరుగుతున్న చర్చ. గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన 100% విజయభేరి ఇచ్చిన ఉత్సాహంతో, కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నారు.

ఈ నేపథ్యంలో జనసేన పార్టీ స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. స్థానిక సమరంలో పవన్ కళ్యాణ్ కీలకం కావడానికి ప్రధాన కారణాలు చాలానే ఉన్నాయి. స్థానిక ఎన్నికలకు ఆయువు పట్టు వంటి.. గ్రామీణ అభివృద్ధి - పంచాయతీ రాజ్ పోర్ట్‌ఫోలియోపై ఆయన ప్రధానంగా దృష్టి పెట్టారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్నారు. ఉపాధి హామీ నిధుల విడుదల, గ్రామాల్లో పనుల నిర్వహణ, ఇటీవల నిర్వహించిన చారిత్రాత్మక గ్రామ సభలు ఆయనకు గ్రామీణ ఓటర్లలో, ముఖ్యంగా తటస్థులలో భారీ క్రేజ్‌ను తెచ్చిపెట్టాయి.

కూటమి సమన్వయం విషయానికి వస్తే.. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమిగా ఈ ఎన్నికల్లోనూ కలిసి పోటీ చేసే అవకాశం ఉంది. సీట్ల సర్దుబాటు, క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయం కుదర్చడంలో పవన్ కళ్యాణ్ నిర్ణయాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మహిళలు, యువత మద్దతును కూడ గట్టడంలోనూ కీలక రోల్ పోషిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టి పెట్టడం, పవన్ కళ్యాణ్ క్లీన్ పాలిటిక్స్ ఇమేజ్ మహిళా, యువ ఓటర్లను జనసేన వైపు ఆకర్షిస్తున్నాయి.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో, క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకోవడానికి పవన్ కళ్యాణ్ వ్యూహాలు ఇటు జనసేన పార్టీకి అటు కూటమికి దిక్సూచిలా మారనున్నాయి. మొత్తంగా గత సార్వత్రిక ఎన్నికల సమయంలో అనుకూలంగా మారిన ఆయన వ్యూహాలు ఇప్పుడు కూడా సానుకూలంగానే మారనున్నాయని అంటున్నారు. ఈ పరిణామం కూటమికి మరింత బలం చేకూరుస్తుందని అంటున్నారు.

# వైభవ్ సూర్యవంశీపై తిలక్ వర్మ స్లెడ్జింగ్.. అర్ధశతకం చేజార్చుకున్న యువ సంచలనం.. ఫ్యాన్స్ ఫైర్!

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో 15 ఏళ్ల వైభవ్‌పై తిలక్ వర్మ స్లెడ్జింగ్
- 44 పరుగుల వద్ద ఔటైన యువ సంచలనం సూర్యవంశీ
- తిలక్ తీరుపై సోషల్ మీడియాలో అభిమానుల అసంతృప్తి
- మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ మెరుపు అర్ధశతకం (72)



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్లో యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. నేడు సౌత్ జోన్‌తో ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 44 పరుగులు చేసి అర్ధశతకానికి చేరువలో ఔటయ్యాడు. అయితే, అతను ఔటవడానికి ముందు సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మతో జరిగిన ఓ చిన్న సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తిలక్ వర్మ, వైభవ్‌ను ఉద్దేశించి స్లెడ్జింగ్ చేయగా, ఆ తర్వాత కొద్దిసేపటికే వైభవ్ తన వికెట్ కోల్పోయాడు. మ్యాచ్ సమయంలో తిలక్ వర్మ.. “ఏంటి యార్ ఈ వైస్ కెప్టెన్” అంటూ వైభవ్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడటం వినిపించింది. అయితే, ఈ సంఘటన తర్వాత ఇద్దరు ఆటగాళ్లు నవ్వుతూ కనిపించడంతో దీన్ని సీరియస్‌గా తీసుకోనట్లు అనిపించింది. కానీ, సోషల్ మీడియాలో మాత్రం అభిమానులు తిలక్ తీరును తప్పుబడుతున్నారు. 15 ఏళ్ల కుర్రాడిపై స్లెడ్జింగ్ వ్యూహం అవలంబించడం సరికాదని పలువురు విమర్శలు గుప్పించారు. ఈ స్లెడ్జింగ్ తర్వాత చామ మిలింద్ బౌలింగ్‌లో వైభవ్ ఔటయ్యాడు. అంతకుముందు వైభవ్ తన ఇన్నింగ్స్‌ను ఎంతో దూకుడుగా ప్రారంభించాడు. భారత సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లోనూ అద్భుతమైన షాట్లు ఆడాడు. మొత్తం మీద 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు సాధించాడు. వైభవ్ దూకుడైన ఆటతీరు మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్‌పైనా ప్రభావం చూపినట్లు కనిపించింది. ఈశ్వరన్ కూడా దూకుడుగా ఆడి 86 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 72 పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో శుభారంభం చేసింది.

# సాత్విక్-చిరాగ్ సంచలనం.. చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం

- చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్
- ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం
- తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం
- ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్
- గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు. గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు. నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

# నా రిటైర్మెంట్ ఎప్పుడో నాకే తెలుసు.. రోహిత్‌పై ఆగని రూమర్లు: బీసీసీఐ మీటింగ్‌లో అసలేం జరిగింది?






**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో ఒక ఆటగాడు తోటి ప్లేయర్లతో కలిసి బాల్కనీలో కూర్చున్నా, లేదా కుటుంబ సభ్యులు ఐపీఎల్ మ్యాచ్‌కు వచ్చినా.. ఆఖరికి ఏదైనా రియాలిటీ షోలో కనిపించినా దానిని రిటైర్మెంట్ సంకేతంగా భావించడం పరిపాటిగా మారింది. రోహిత్ శర్మ విషయంలోనూ ప్రస్తుతం అదే జరుగుతోంది. శుభ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రోహిత్ భవిష్యత్తుపై రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. కానీ ఇంగ్లాండ్ పర్యటనలో లార్డ్స్ మైదానంలో ప్రదర్శతో హిట్ మ్యాన్ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. బయట వస్తున్న విమర్శలపై స్పందిస్తూ శబ్దాలు (నాయిస్) లేకపోతే అందులో మజా ఉండదని రోహిత్ ఆ వార్తలని కొట్టిపారేశాడు.

**బీసీసీఐ రివ్యూ మీటింగ్ సంచలనం.. సెలెక్టర్ల ఒత్తిడి నిజమేనా?:**
రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై ఇటీవల ముంబైలో జరిగిన బీసీసీఐ రివ్యూ మీటింగ్‌లో చర్చ జరిగినట్లు వార్తలు రావడం వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. బోర్డులోని ఒక సెలెక్టర్ రోహిత్‌ను రిటైర్ అవ్వాలని కోరినట్లు, దానికి హిట్ మ్యాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు, ఆ తర్వాత పెద్దల జోక్యంతో సర్దుమనిగిందంటూ రకరకాల వర్షన్లు ప్రచారంలోకి వచ్చాయి. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ మీటింగ్‌కు హాజరుకాకపోవడంపై కూడా అనేక అంచనాలు వెలువడ్డాయి. కానీ బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ఆధారాలు లేని వార్తలను వ్యాప్తి చేయవద్దని స్పష్టం చేశారు.

**వడాపావ్ మానేసి పక్కా ఫిట్‌నెస్.. కంబ్యాక్ కోసం తీవ్ర శ్రమ:**
11,000 పైగా వన్డే పరుగులు, మూడు డబుల్ సెంచరీలు, ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 వరల్డ్ కప్ వంటి చారిత్రాత్మక విజయాలను భారత్‌కు అందించిన రోహిత్ శర్మ, తన రిటైర్మెంట్ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో నిర్ణయించుకునే హక్కును సంపాదించుకున్నాడు. రిటైర్ అవ్వడానికి తాను ఇంకా రెడీగా లేనని అతని చర్యలే నిరూపిస్తున్నాయి. రోహిత్ తనకు ఎంతో ఇష్టమైన వడాపావ్‌ను కూడా త్యాగం చేసి, బరువు తగ్గి మైదానంలో మరింత వేగంగా కదిలేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. డొమెస్టిక్ క్రికెట్ ఆడేందుకు సైతం ఆసక్తి చూపిస్తూ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే కసి తనలో ఇంకా ఉందన్నాడు.

**జైస్వాల్ సిద్ధమే.. రోహిత్‌ను బలవంతంగా తప్పించాలా?:**
భారత క్రికెట్ భవిష్యత్తు కోసం యశస్వి జైస్వాల్ వంటి యువ కిరణాలు సిద్ధంగా ఉన్న మాట వాస్తవమే, సెలెక్టర్లు కూడా 2027 వన్డే ప్రపంచకప్ దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రచించడంలో తప్పులేదు. కానీ ఉత్తమ ఫామ్, ఫిట్‌నెస్‌తో ఉన్న రోహిత్ శర్మను బలవంతంగా బయటకు పంపడం సరైన పద్ధతి కాదని క్రీడా పండితులు పేర్కొంటున్నారు. జైస్వాల్‌ను జట్టుతో పాటు ప్రయాణింపజేస్తూ, తగినన్ని లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడిస్తూ వారసుడిగా తీర్చిదిద్దడం సెలెక్టర్ల బాధ్యత. అంతే తప్ప ప్రతి మ్యాచ్‌నూ రోహిత్ కు రిటైర్మెంట్ పరీక్షగా మార్చడం సరికాదు. ఆటగాడిగా తాను వైదొలగాలని భావించిన రోజు హిట్ మ్యాన్ స్వయంగా ఆ నిర్ణయాన్ని ప్రకటించనున్నాడు.


# 2026లో అదిరిపోయే కంబ్యాక్ ఇచ్చిన సౌత్, నార్త్ హీరోలు!











చిత్ర పరిశ్రమలో గెలుపోటములు సహజం. వరుస పరాజయాలు ఎదురైనప్పుడు ఆ హీరో పనైపోయిందని విమర్శ కులు పెదవి విరిచిన వేళ తమ అసలైన స్టామినాతో తిరిగి పుంజుకోవడమే నిజమైన స్టార్‌డమ్. 2026 నాటి చరిత్రను పరిశీలిస్తే సౌత్ నుంచి నార్త్ వరకు పలువురు అగ్ర కథానాయకులు వరుస ఫ్లాపుల నుంచి తేరుకుని ఊహించని రీతిలో బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో ఖతర్నాక్ కంబ్యాక్ ఇచ్చారు. మాస్ మహారాజా రవితేజకు ఇటీవల ఎదురైన కొన్ని పరాజయాల తర్వాత ఆయన మార్కెట్ తగ్గిందనే విమర్శలు వినిపించాయి. అయితే ఆ విమర్శలన్నింటికీ చెక్ పెడుతూ ఆయన నటించిన -ఇరుముడి- చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. నిర్మాతలు, డిస్ట్రి బ్యూటర్లకు ఏకంగా 100 కోట్ల నికర లాభాలను తెచ్చిపెట్టి రవితేజ మాస్ పవర్‌ను మరోసారి నిరూపించింది. కోలీవుడ్ వర్సటైల్ నటుడు సూర్య సైతం కొన్ని ఫ్లాపుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ 2026 ఆయన కెరీర్‌లోనే గోల్డెన్ ఇయర్‌గా నిలిచింది. సూర్య నటించిన -కరుపు- బాక్సాఫీస్ వద్ద 300 కోట్ల అసాధారణ వసూళ్లను పాధించింది. ఆ వె వెంటనే రిలీజ్ అయిన -విశ్వనాథ్ అండ్ సన్స్- 240 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. ఇలా ఒకే ఏడాదిలో రెండు భారీ హిట్ల ద్వారా సూర్య పవర్ఫుల్ కంబ్యాక్ ఇచ్చారు. మాలీవుడ్ లో -ప్రేమమ్- చిత్రంతో సంచలనం సృష్టించిన నివిన్ పౌలీ ఆ తర్వాత సరైన విజయం లేక వెనుకబడ్డారు. అయితే ఆయన కథానాయకుడిగా వచ్చిన -బెత్లహం కుటుంబ యూనిట్- చిత్రం మాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇటీవల రిలీజ్ అయిన ఈ సినిమా ఏకంగా 200 కోట్ల వసూళ్లతో నివిన్ పౌలీ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. బాలీవుడ్‌లో కూడా ఒకప్పటి మాస్ హీరో ఇమ్రాన్ హాష్మీ రీ-ఎంట్రీ సరికొత్త చరిత్రను తిరగరాసింది. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన నటించిన -ఆవారాపన్ 2- చిత్రం థియేటర్లలో సరికొత్త ఊపును తీసుకొచ్చింది. తన మార్కు డైలాగ్ డెలివరీ, మ్యూజిక్, నటనతో ఇమ్రాన్ హాష్మీ బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద పవర్ఫుల్ మాస్ కంబ్యాక్‌ను నమోదు చేశారు. అలా నలుగురు హీరోలకు 2026 మరో మైలురాయిగా నిలిచిపోతుంది. సరైన కథ, పాత్ర పడితే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని సాధించిన విజయాలు నిరూపించాయి. విమర్శించిన నోళ్లే ప్రశంసలు కురిపించాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965